క్లుప్తంగా

ఓటరు స్లిప్‌లు పంపిణీ



నూజెండ్ల: ఈనెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన వారికి ఓటరు స్లిప్‌లు పంపిణీ కార్యక్రమం గురువారం చేపట్టినట్లు తహసీల్దారు ఆర్.రమేష్‌కుమార్ తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 27 గ్రామపంచాయతీలో 1011 ఎమ్మెల్సీ ఓట్లు ఉండగా, ఆయా గ్రామాల వారిగా వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది ఇంటింటికి తిరిగి ఓటు స్లిప్‌లు అందజేస్తున్నట్లు తెలిపారు. నూజెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో పోలింగ్ కేంద్రంలో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఆయనతో పాటు డిప్యూటీ తహసీల్దారు బాల వెంకటేష్ ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే బొల్లా పుట్టినరోజు వేడుకలు



వినుకొండ: వినుకొండ మాజీ శాసనసభ్యుడు బొల్లా బ్రహ్మనాయుడు పుట్టినరోజు వేడుకలు వినుకొండ పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకొన్నారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు హయాంలో నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐదు మండలాల నాయకులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుర్వేదంతో చెక్

నూజెండ్ల: దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుర్వేద మందుల ద్వారా మెరుగైన వైద్య సేవలు పొందవచ్చునని ఆయుష్ వైద్యాధికారి బోరుగల్లి మహాదేవ్ అన్నారు. గురువారం ఆయుర్వేద వైద్యాధికారి మాట్లాడుతూ దీర్ఘకాలిక జబ్బులకు ఆయుర్వేదంలో మెరుగైన వైద్యసేవలు ఉన్నాయన్నారు. మహిళలు ఎదుర్కొనే అనీమియా (రక్తహీనత) కు సమర్థవంతమైన మందులు ఆయుర్వేద వైద్యంలో ఉన్నాయన్నారు. మండల ప్రజలు ఆయుర్వేద వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వసతి గృహం మరమ్మతులకు నిధులు మంజూరు

నూజెండ్ల: మండల కేంద్రమైన నూజెండ్ల బాలుర బీసీ సంక్షేమ వసతి గృహాన్ని ఏపీఈడబ్ల్యుఐడీసీ ఈఈ రవీంద్ర గురువారం సందర్శించి వసతి గృహ స్థితిగతులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో 10 బీసీ హాస్టళ్ల మరమ్మతుల నిమిత్తం రూ. 31.50 లక్షలు నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. ఇందులో భాగంగా నూజెండ్లలోని వసతి గృహానికి రూ.5 లక్షలు నిధులతో విరిగిపోయిన తలుపులు, రూఫ్ ఫ్లోరింగ్, విద్యుత్, పెయింటిగ్ మరమ్మతులు చేస్తామన్నారు. త్వరలో స్వచ్ఛభారత్ నిధుల ద్వారా పది మరుగుదొడ్లను నూతనంగా నిర్మించనున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు వసతి గృహ సంక్షేమ అధికారి ప్రభాకర్ రెడ్డి, ఏఈ జాన్‌సైదా ఉన్నారు

రేపు మండల పరిషత్ అత్యవసర సమావేశం

నరసరావుపేట రూరల్: మండల పరిషత్ అత్యవసర సర్వసభ్య సమావేశం ఈనెల 22వ తేదీ శనివారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ టీవీ కృష్ణకుమారి గురువారం తెలిపారు. ఎంపీపీ మూరబోయిన సుబ్బాయమ్మ అధ్యక్షతన మధ్యాహ్నం 2గంటలకు సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో శాఖల వారీగా సమీక్ష ఉంటుందని తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

తపాలా జీవిత బీమా చెక్కు అందజేత



నరసరావుపేటటౌన్: తపాలా జీవిత బీమా చెక్కును గురువారం బాధిత కుటుంబానికి పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ వెంకటస్వామి అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్ తపాలా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వినుకొండ నియోజకవర్గం కొప్పుకొండ గ్రామానికి చెందిన పాల్వా అంజిబాబు తపాలా జీవిత బీమా చేసి 2022 నవంబర్ 14న మరణించారన్నారు. దీంతో ఆయన భార్య రామాంజమ్మకు రూ. 9.31 లక్షల విలువ గల చెక్కును అందజేశామన్నారు. వినుకొండ, నరసరావుపేట సబ్ డివిజన్‌ల ఇన్‌స్పెక్టర్‌లు ఎంవీ సురేష్, ఆర్.యాదగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

జ్ఞానజ్యోతి వెలిగించేలా..!

- అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతి శిక్షణా తరగతులు
- విద్యా నైపుణ్యాల పెంపుదలకు చర్యలు
- చిన్నారులు పాఠశాలలకు వచ్చేవిధంగా సంసిద్ధం చేయటం
- అభ్యాసన లోపాలు సవరించటం లక్ష్యం



చార్టు ప్రదర్శనపై అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన

శావల్యాపురం: కేంద్ర ప్రభుత్వ సారథ్యంలో ప్రపంచ బ్యాంకు నిధులతో విద్యా విధానంలో పెను మార్పులు తీసుకు రావటానికి రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులకు జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమాలను విద్యాశాఖ ఆరు రోజుల పాటు చేపట్టింది. రాష్ట్రంలో 45 వేల పాఠశాలల్లో 6 నుంచి 14 సంవత్సరాల లోపు 40 లక్షల చిన్నారులకు 55 వేల అంగన్‌వాడీలకు, 3 నుంచి 6 సంవత్సరాల లోపు 10 లక్షల చిన్నారులకు మెరుగైన విద్యాబోధన చేయటానికి అంగన్‌వాడీ టీచర్లకు, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు ఇస్తున్నారు. అంగన్‌వాడీలను ప్రాథమిక పాఠశాలలకు అనుసంధానం చేసి 1,2 తరగతులు బోధించేవిధంగా పిల్లల మానసిక, అభ్యసన స్థాయిలపై అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పించటమే శిక్షణా కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం

ఆరురోజుల శిక్షణా తరగతుల్లో అంశాలు..

చిన్నారులను పాఠశాలలకు వచ్చేవిధంగా సిద్ధం చేయటం, ప్రస్తుతం ఉన్న అభ్యాసన లోపాలను పరిష్కరించటం, అలాగే పిల్లల్లో విద్యానైపుణ్యం పెంపొందించటం, అంగన్‌వాడీలో 1,2 తరగతుల విద్యార్థులకు జ్ఞానేంద్రియాల గురించి శారీరక అభివృద్ధి, మస్తిష్క వికాసానికి దోహదపడతాయి. చిన్నారుల్లో విద్యా నాణ్యత మెరుగుపరచేందుకు, స్థానిక అవసరాలకు అనుగుణంగా విద్యా కార్యక్రమాలు ఆవిష్కరణ. పూర్వ ప్రాథమిక విద్య కోసం రోడ్డు మ్యాప్ సిద్ధం చేయటం.

■ జ్ఞానజ్యోతి శిక్షణా తరగతులు శావల్యాపురంలో జడ్పీ ఉన్నత పాఠశాల్లో జరిగాయి. శావల్యాపురం, వినుకొండ క్లస్టర్ పరిధిలో 75 మంది అంగన్‌వాడీలు పాల్గొన్నారు. ప్రభుత్వ నిబంధనలు మేరకు 5 అంశాలపై శిక్షణ ఇవ్వాల్సి ఉండగా, మూడు అంశాలపై ఈనెల 18వ తేదీ నుంచి 20వరకు శిక్షణా తరగతులు జరిగాయి. మిగిలిన రెండు అంశాలపై ఈనెల 22, 24, 25 తేదీల్లో అంగన్‌వాడీ టీచర్లకు మళ్లీ శిక్షణ ఇవ్వనున్నారు.

నాణ్యమైన విద్యతో అభివృద్ధి



నాణ్యమైన విద్య అందిస్తే అభివృద్ధి సాధ్యమవుతుంది. శారీరక మేధ, సామాజిక, భావోద్వేగ, భాష, అక్షరాస్యత, సౌందర్య, సాంస్కృతిక వికాసం చిన్నారుల్లో కలగజేయటం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం.

– పుసులూరి లలితకుమారి, ఎంఈఓ–2, శావల్యాపురం

సులభతర బోధనకు శిక్షణ



ప్రస్తుతం అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యాబోధన జరుగుతుంది. జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లకు ప్రాథమిక విద్యలో 1,2 తరగతుల చిన్నారులకు సులభతరంగా బోధించటానికి శిక్షణ ఇవ్వటం జరుగుతుంది. మండలంలోని 15 గ్రామపంచాయతీలో 75 మంది అంగన్‌వాడీలు శిక్షణా తరగతుల్లో పాల్గొన్నారు.

– కుప్పం శ్రీలత, ఐసీడీఎస్ సూపర్‌వైజరు, శావల్యాపురం

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

నరసరావుపేట రూరల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎస్ఎస్అండ్ఎన్ కళాశాల అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్ అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సహకారంతో కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కంజుల జగన్మోహన్‌రెడ్డి, కళాశాల అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, కార్యదర్శి నాగసరపు సుబ్బరాయగుప్తాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 16 సంవత్సరాలుగా కళాశాలలో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆపదలో ఉన్న వారికి రక్తం అందిస్తే వారి కుటుంబానికి సహాయపడినట్లే అని తెలిపారు. రెడ్ క్రాస్ అధ్యక్షుడు డాక్టర్ కంజుల మాట్లాడుతూ రక్తదాన శిబిరాల్లో సేకరించిన రక్తాన్ని పరీక్షలు నిర్వహించి తలసేమియా ఎనమిక్, హిమోఫోలియా వంటి వ్యాధులతో బాధపడే వారికి ఉచితంగా అందిస్తామని తెలిపారు. కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్స్, విద్యార్థులు రక్తదానం చేశారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ శిరీష, కళాశాల ప్రిన్సిపాల్ ఎంఎస్ సుధీర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాసపాయి, ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ బీఎస్ఆర్‌కే రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఐబీఎమ్ ప్లేస్‌మెంట్ ట్రెనింగ్...

నరసరావుపేట రూరల్: ఎస్ఎస్అండ్ఎన్ కళాశాలలో ఐబీఎం కంపెనీ ఆధ్వర్యంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ ట్రెనింగ్ ప్రోగ్రాం గురువారం ప్రారంభమయింది. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ట్రెనింగ్ ప్రోగ్రాంలో ఏఐ, సాఫ్ట్‌స్కిల్స్‌పై విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. 150 మంది విద్యార్థులు శిక్షణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, కార్యదర్శి నాగసరపు సుబ్బరాయగుప్తా, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎ.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. శిక్షకులుగా ఎం.విగ్నేష్, ఎస్.దిలీప్‌కుమార్ హాజరయ్యారు.

కొనసాగిన జ్ఞానజ్యోతి శిక్షణా తరగతులు



నూజెండ్ల: చిన్నారుల భవిష్యత్‌ను తీర్చిదిద్దాల్సిన బాధ్యత అంగన్‌వాడీలపై ఉందని ఆల్టర్నేటివ్ స్కూల్ కో–ఆర్డినేటరు కె.శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండల కేంద్రమైన నూజెండ్ల జడ్పీ ఉన్నత పాఠశాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణా తరగతుల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు సంవత్సరాలలోపు చిన్నారులకు సృజానాత్మకతతో కూడిన పూర్వ ప్రాథమిక విద్యను బోధించాలన్నారు. బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలకు వెళ్ళేలా తర్ఫీదు ఇవ్వాలన్నారు. ఎంఈఓ రవిచంద్ర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఇన్యాసమ్మ, నాగరాజకుమారి తదితరులు ఉన్నారు.

ఈపూరులో...

బొల్లాపల్లి: పాఠశాల విద్య, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జ్ఞానజ్యోతి కార్యక్రమం మూడో రోజు గురువారం నిర్వహించారు. ఈపూరు ప్రాజెక్టు పరిధిలో బొల్లాపల్లి, ఈపూరు జడ్పీ, మోడల్ హైస్కూల్స్‌లో జ్ఞానజ్యోతి శిక్షణ నిర్వహించారు. జాతీయ నూతన విద్యావిధానంలో భాగంగా పూర్వప్రాథమిక విద్యలో చిన్నారులకు, తల్లిదండ్రులకు తర్ఫీదు ఇచ్చేందుకు అంగన్‌వాడీలకు పలు విభాగాల్లో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రీసోర్స్‌పర్సన్స్, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థికస్థితి మెరుగుపరచడమే లక్ష్యం

పశు సంవర్థక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటేశ్వర్లు నాయక్



రొంపిచర్ల గొర్రెల పెంపకం యూనిట్ వద్ద ఏడీఏ డాక్టర్ వెంకటేశ్వర్లు నాయక్, పశు వైద్యులు

రొంపిచర్ల: రైతుల ఆర్థిక స్థితిని మెరుగుపరచడమే లక్ష్యంగా పశు సంవర్థక శాఖ పనిచేస్తుందని పశు సంవర్థక శాఖ ఏరియా సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటేశ్వర్లు నాయక్ అన్నారు. మండలంలో సంతగుడిపాడు, కర్లకుంట, రొంపిచర్ల గ్రామాలలో గురువారం పశు సంవర్థక శాఖ ఏరియా సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటేశ్వర్లు నాయక్ పర్యటించారు. ఆయా గ్రామాల్లో నేషనల్ లైవ్ స్టాక్ మిషన్‌లో 50లక్షల సబ్సిడీతో చేపట్టిన గొర్రెల పెంపకం యూనిట్లు, పశు వైద్యశాల ఆధునికీకరణ పనులను తనిఖీ చేశారు. మండలంలో సంతగుడిపాడు గ్రామంలో ఎన్ఎల్ఎం గొర్రెల పెంపకం యూనిట్, రొంపిచర్లలో ఎన్ఎల్ఎం గొర్రెల పెంపకం యూనిట్‌ను సందర్శించి వాటి నిర్వహణ, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అదే విధంగా కర్లకుంట గ్రామంలో పశు వైద్యశాల ఆధునికీకరణ పనులను పరిశీలించారు. నకరికల్లు మండల పశు సంవర్థక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ రామారావు, పశు వైద్యాధికారులు డాక్టర్ ఆవుల సాయి మహేష్ రెడ్డి, డాక్టర్ వంశీ, పశు వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

లక్ష్మణరావుకు మద్దతుగా ప్రచారం



పట్టణంలో సీఐటీయూ నాయకులతో కలిసి ప్రచారంలో పాల్గొన్న గోపీచంద్

నరసరావుపేట: పట్టభద్రులైన యువకులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, కార్మికులు, వలంటీర్లు అందరూ ఈనెల 27న జరగనున్న శాసనమండలి కృష్ణా–గుంటూరు జిల్లాల నియోజకవర్గ ఎన్నికల్లో కేఎస్ లక్ష్మణరావుకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించుకోవాలని ఏపీ గ్రామ, వార్డు వలంటీర్ల సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారు ఈదర గోపీచంద్ విజ్ఞప్తి చేశారు. గత మూడు రోజులుగా పట్టణంలోని రామిరెడ్డిపేట – నవోదయనగర్‌లలో సీఐటీయూ, యూటీఎఫ్ నాయకులు వలీఖాన్, షేక్ మసూద్‌ల ఆధ్వర్యంలో సాగుతున్న ఇంటింటి ప్రచారంలో వారితో కలిసి పాల్గొన్నారు. కూటమిపాలనలో నేటివరకు ఎన్నికలలో ఇచ్చిన హామీల అమలు నెరవేర్చని నేపథ్యంలో వలంటీర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, కాంట్రాక్టు ఉద్యోగులు, ఆరోగ్యశ్రీ సిబ్బంది తదితర వర్గాల ప్రజలు మండలిలో తమపక్షాన బాధలను వినిపించగల సత్తా, నిజాయితీ కలిగిన లక్ష్మణరావును గెలిపించుకోవాలని కోరారు. వలంటీర్ల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బాషా నేతృత్వంలో వలంటీర్ల బృందం ఇప్పటికే లక్ష్మణరావును కలిసి తమ మద్దతు తెలియజేశారని గుర్తు చేశారు.

రేఖా గుప్తా నియామకంపై హర్షం



పట్టణంలోని మల్లమ్మ సెంటర్‌లో బాణసంచా కాలుస్తున్న ఆర్యవైశ్య నాయకులు

నరసరావుపేట: ఢిల్లీ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆర్యవైశ్య నాయకురాలు రేఖా గుప్తా ఎంపికవడంపై స్థానిక ఆర్యవైశ్యులు హర్షం వ్యక్తంచేస్తూ గురువారం సాయంత్రం బాణసంచా కాల్చి సంబరాలు చేశారు. స్థానిక మల్లమ్మ సెంటర్‌లోని ఆర్యవైశ్య నేత బత్తుల మురళి ఇంటి వద్ద అందరికీ మిఠాయిలు పంపిణీ చేశారు. ఇసప్పాలెం ఆర్యవైశ్య అన్నదాన సత్రం కన్వీనర్ బత్తుల మురళి, చేగు వెంకటేశ్వరరావు, పెరుమాళ్ళ సత్యనారాయణ, మిరియాల నాగప్రసాదరావు, కొఠారి రంజిత్ కుమార్, బొగ్గారపు బ్రహ్మానందం, దేవిశెట్టి సుధారాణి, భవిరిశెట్టి ఆదిలక్ష్మి, తడికమళ్ళ బాలా ఆంజనేయులు పాల్గొన్నారు.

సేద్యపు కుంటలకు దరఖాస్తు చేసుకోండి

యడ్లపాడు: పంట చేలలో రైతులకు ఉచిత సేద్యపు నీటి గుంటల తవ్వకాలు అందించేందుకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ వి.హేమలత దేవి తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లోని రైతులకు సేద్యపు కుంటలు, ఇంకుడు గుంతల ప్రయోజనాలు, వాటి నిర్వహణ, వినియోగంపై సమగ్ర అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గృహాల్లో ఇంకుడు గుంతలు తవ్వుకునే వారికి రూ.500, మెటీరియల్ ఖర్చుల నిమిత్తం రూ.5వేలు చెల్లించనున్నట్లు తెలిపారు. ఉపాధి సిబ్బంది ప్రతి గ్రామ పంచాయతీలో కనీసం పది సేద్యపు నీటి కుంటలు, అలాగే పది ఇంకుడు కుంటలు పూర్తిచేసేలా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఏపీఎం సుందరరావు, టీఏ మాధవి, జై వీరయ్య తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు 'స్ఫూర్తి'



ఏపీ మోడల్ స్కూల్లో స్ఫూర్తి కార్యక్రమంలో పాల్గొన్న హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు

బొల్లాపల్లి: మండలంలోని ఉన్నత పాఠశాలల్లో, మోడల్ స్కూల్లో, పదో తరగతి విద్యార్థులకు గురువారం స్ఫూర్తి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి ఆన్‌లైన్ ద్వారా ఆయా హైస్కూళ్లలో మధ్యాహ్నం 3గంటల నుంచి 5గంటల వరకు విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు రాసే విధానంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు పరీక్ష రాసే సమయంలో ఒత్తిడి నివారణ, భయాందోళనను తొలగేందుకు ప్రేరణ కలిగించేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు.ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

సత్తెనపల్లి: న్యాయవాద చట్టం–2025 సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబాల అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించారు. గుంటూరు జిల్లా బార్ ఫెడరేషన్ పిలుపులో భాగంగా సత్తెనపల్లిలోని నాలుగు న్యాయస్థానాల్లో న్యాయవాదులు న్యాయ దేవత విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. శుక్రవారం కూడా విధులు బహిష్కరణ కొనసాగుతుందని అనిల్‌కుమార్ తెలిపారు. న్యాయవాదులు న్యాయవాద చట్టం–2025 సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బత్తిన శ్రీనివాసబాబు, దివ్వెల శ్రీనివాసరావు, జొన్నలగడ్డ విజయ్‌కుమార్, రాజవరపు శివ నాగేశ్వరరావు, సయ్యద్ అబ్దుల్ రహీం, పాపారావు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో విద్యుత్ లైన్ల ఆధునికీకరణ

ప్రభల తరలింపునకు వీలుగా శాశ్వత పరిష్కారం



అమీన్ సాహెబ్‌పాలెంలో వైద్యశాల వద్ద కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

నాదెండ్ల: మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెం, అప్పాపురం గ్రామాల నుంచి మహాశివరాత్రి పురస్కరించుకుని భారీ విద్యుత్ ప్రభలను తరలించే ఆనవాయితీ ఉంది. అయితే రెండు ప్రభలు తరలించే క్రమంలో విద్యుత్ వైర్లు తగిలే అవకాశం ఉన్నందున విద్యుత్ సరఫరా నిలిపివేసేవారు. దీనికి పరిష్కారంగా విద్యుత్‌శాఖ అధికారులు సమస్యను అధిగమించేందుకు ఒక్కో గ్రామంలో రూ.5 లక్షల చొప్పున రెండు గ్రామాల్లో రూ.10 లక్షల మేర అంచనాలతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లతో పాటూ నూతన విద్యుత్ లైన్లు, క్రాస్‌లైన్ల తొలగింపు చేపట్టారు. దీంతో రానున్న రోజుల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చేస్తున్నట్లు మండల విద్యుత్‌శాఖ ఏఈ ప్రసాద్ తెలిపారు. ఈనెల 26న మహాశివరాత్రిని పురస్కరించుకుని పనులు ముమ్మరంగా చేస్తున్నామని, రెండు రోజుల్లో పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

చిలకలూరిపేట: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బందెల రవికుమార్ కోరారు. గురువారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల వేతనాల చెల్లింపు, పనుల అప్పగింత నిర్వహణ సాంఘిక భద్రత, మున్సిపల్ శాఖకే పూర్తి బాధ్యతలు ఉండాలని ప్రైవేట్ కంపెనీ, ఏజెన్సీలకు అప్పజెప్పొద్దని కోరారు. అవుట్‌సోర్సింగ్ పారిశుధ్య ఇంజినీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, పర్మినెంట్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్‌లో ఎన్‌క్యాష్‌మెంట్, మూడు డీఏలు సత్వరం విడుదల చేయాలని కోరారు. ఇంజినీరింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని, గత 15 సంవత్సరాలుగా స్కూల్ స్వీపర్లకు వేతనాలు పెంచలేదని, సత్వరం వీరి వేతనాలు పెంచాలని కోరారు. మృతిచెందిన, రిటైర్మెంట్ కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు పనులు కల్పించాలన్నారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు స్పందిస్తూ ఈ అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి తాళ్లూరి బాబురావు, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి దాసరి వరహాలు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాని, మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కొమరగిరి చెంచయ్య, ఆక్కులయ్య, అంజయ్య, జయరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చిత్రకళా పండుగ



ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులుకు మెమొంటో అందజేస్తున్న వజ్రగిరి జెస్టిస్ తదితరులు

వినుకొండ: పట్టణంలోని వాసవి హైస్కూల్లో చిత్రకళా పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఏడబ్ల్యూఎస్ చిత్రకళాకారులు గీసిన చిత్రాలను ప్రదర్శనలో ఉంచారు. 25 మంది చిత్రకారులు స్పాట్‌లో బొమ్మలు గీసి చూపరులను ఆకట్టుకున్నారు. డాక్టర్ వజ్రగిరి జెస్టిస్ వందలాది విద్యార్థుల ఎదుట ఆర్ట్ డెమో చేయడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ చిత్రకళాకారుడు వజ్రగిరి జెస్టిస్ చిత్రకళారంగానికి ఎంతో సేవ చేశారన్నారు. అనంతరం ఉషోదయం చిత్రాన్ని కొనుగోలు చేశారు. ఇటీవల నిర్వహించిన చిత్రకళా పోటీల్లో విజేతలైన విద్యార్థులకు జీవీ ఆంజనేయులు బహుమతులు అందజేశారు. పీఏడబ్ల్యూఎస్ గౌరవాధ్యక్షుడు పి.జె.లూకా, న్యాయవాది మూర్తి, వాసవి హైస్కూల్ అధినేత నాగోతు అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో కంది కొనుగోలు



రైతులతో మాట్లాడుతున్న ఏఓ సుగుణాబేగం

నూజెండ్ల: కంది పంటను ప్రభుత్వం మద్దతు ధర క్వింటా రూ.7550లకు రైతుసేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి సుగుణా బేగం తెలిపారు. గురువారం మండలంలోని వి.అప్పాపురం రైతుసేవా కేంద్రాన్ని సందర్శించి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ కంది సాగు చేసిన రైతులు తమ పేర్లను రైతుసేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. కందుల కొనుగోలు నాణ్యత ప్రమాణాలు ఆధారంగా తేమశాతం 12 లోపు ఉండాలన్నారు. అదేవిధంగా రైతులు ఫార్మర్ రిజిష్టరు నమోదు చేసుకున్న 11 అంకెల విశిష్టత గుర్తింపు సంఖ్య ప్రామాణికంగా ఆధారంగా కేంద్ర– రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు వర్తిస్తాయన్నారు. రైతుసేవా కేంద్రాల్లో సమగ్ర వివరాలు ఆధార్, పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కు అనుసంధానమైన సెల్‌ఫోను నంబరు అందజేయాలన్నారు. వీఏఏ పి.అశోక్, ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జ్ కోటేశ్వరరావు, ఐసీఆర్‌పీ రోషిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

గిరిప్రదక్షిణ రోడ్డు శుభ్రం

వినుకొండ: మహాశివరాత్రి సందర్భంగా శ్రీ వరసిద్ధి వినాయకుని దేవస్థానం నుంచి వినుకొండ కొండ గిరి ప్రదక్షిణ కార్యక్రమం జరగనున్నందున గిరి ప్రదక్షిణ చేసేందుకు అనువుగా రహదారి మొత్తం శుభ్రం చేశారు. ఈ సందర్భంగా రోడ్డుకు అడ్డంగా ఉన్న పిచ్చిమొక్కలను, కంప చెట్లను తొలగించి భక్తులకు అసౌకర్యంలేకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, సిబ్బంది పాల్గొన్నారు.